## నిర్మల్ జిల్లాకు చేరిన పాఠ్యపుస్తకాలు

నిర్మల్ అర్బన్, మే 24 : నిర్మల్ జిల్లాలోని 836 ప్రభుత్వ పాఠశాలలకు సరఫరా చేసే ఉచిత పాఠ్యపుస్తకాలు 81 శాతం జిల్లాకు చేరుకున్నాయని డీఈవో డాక్టర్ రవీందర్ రెడ్డి తెలిపారు. నిర్మల్ జిల్లాకు పార్ట్‌వన్‌లో భాగంగా మొత్తం 3,61,776 పాఠ్యపుస్తకాలు రావాల్సి ఉండగా 2,93,482 పాఠ్యపుస్తకాలు వచ్చాయని త్వరలో పూర్తి స్థాయిలో రానున్నాయని పేర్కొన్నారు. బడులు ప్రారంభమయ్యేలోగా వీటిని పాఠశాలలకు పంపిణీ చేస్తామని తెలిపారు.



నిర్మల్ జిల్లాకు చేరిన పాఠ్యపుస్తకాలు

## అపరిశుభ్రం..మండల పరిషత్ కార్యాలయ ఆవరణ

భైంసాటౌన్, మే, 24 : భైంసా మండల పరిషత్ కార్యాలయం పరిసరాలు చెత్తాచెదారం, పిచ్చి మొక్కలతో అపరిశుభ్రంగా దర్శనమిస్తున్నాయి. కొందరు ఆకతాయిలు కార్యాలయం ప్రహరీ దగ్గర, వెనుక ద్వారం వైపు బహిర్భూమికి వస్తున్నారు. దీంతో ఆ ప్రాంతం అంతా దుర్వాసన వస్తున్నది. ఉదయం కార్యాలయానికి వచ్చే సిబ్బంది, వివిధ పనుల నిమిత్తం వచ్చే మండల వాసులు ఇబ్బంది పడుతున్నారు. మలమూత్ర విసర్జనకు సౌకర్యాలు లేకపోవడంతో తప్పనిసరి పరిస్థితుల్లో కార్యాలయం వెనుక, పక్కన మూత్ర విసర్జన చేయాల్సి వస్తున్నది. దీనికి తోడు రాత్రుల్లో మందుబాబులు మద్యం తాగి సీసాలు, గ్లాసులు అక్కడే వదిలేస్తున్నారు. ఈ విషయమై ఎంపీడీవో సుధాకర్ రెడ్డిని వివరణ కోరగా కార్యాలయ పరిసరాల్లో అపరిశుభ్రత తన దృష్టికి రాలేదన్నారు.



కార్యాలయ గోడను ఆనుకొని పెరుగుతున్న పిచ్చి మొక్కలు



ఆదిలాబాద్ మార్కెట్ యార్డులో జొన్నలను పరిశీలిస్తున్న కలెక్టర్ రాజర్షి షా

## జొన్నల కొనుగోళ్లలో జాప్యం వద్దు

**ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా**

ఎదులాపురం, మే 24: జొన్నల కొనుగోళ్లలో జాప్యం చేయొద్దని, రైతులకు ఇబ్బంది కలిగించవద్దని అధికారులను ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా ఆదేశించారు. ఆదిలాబాద్‌లోని మార్కెట్ యార్డులో జొన్నల కొనుగోలు కేంద్రాన్ని కలెక్టర్ శుక్రవారం తనిఖీ చేశారు. రిజిస్టర్‌తో పాటు ఆన్‌లైన్ విధానాన్ని పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. రైతులు తీసుకువచ్చిన జొన్నలను వెంటనే తూకం వేసి, టోకెన్లు అందించాలన్నారు. వెంటనే లారీల్లో తరలించాలని ఆదేశించారు. సరిపడా సంఖ్యలో హమాలీలను అందుబాటులో ఉంచాలని, టార్పాలిన్లు, గన్నీ బ్యాగులను, ప్యాడీ క్లీనర్లు ఉండేలా చూడాలన్నారు. ఆదిలాబాద్ మార్కెట్ యార్డులో ఇప్పటివరకూ 3415 మంది రైతుల నుంచి 82వేల క్వింటాళ్ల జొన్నలు కొన్నట్లు సెంటర్ ఇన్‌చార్జి కే పండరి తెలిపారని చెప్పారు. ఇంకా 15 వేల క్వింటాళ్ల జొన్నలు రావచ్చని అంచనా వేశారు. కలెక్టర్ వెంట అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, జిల్లా సహకార అధికారి బీ మోహన్, మార్కెటింగ్ అధికారి శ్రీనివాస్, తదితరులు ఉన్నారు.

### ఈవీఎం స్ట్రాంగ్‌రూమ్ పరిశీలన

ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని టీటీడీసీ, సంజయ్‌గాంధీ పాలిటెక్నిక్ కళాశాల, సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలల్లో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్‌రూంలో 7 అసెంబ్లీ సెగ్మెంట్‌లకు సంబంధించిన ఈవీఎంలను భద్రపరిచారు. ఈ మేరకు శుక్రవారం కలెక్టర్, రిటర్నింగ్ అధికారి రాజర్షి షా పరిశీలించారు. సీసీటీవీ కెమెరాలను, రిజిస్టర్‌ను పరిశీలించారు. నిరంతరం అప్రమత్తంగా ఉండాలని సిబ్బందిని ఆదేశించారు.

### అన్ని అంశాలపై అవగాహన ఉండాలి

ఉద్యోగులు వృత్తి నైపుణ్యం పెంపొందించుకోవాలని, అన్ని అంశాలపై విషయ అవగాహన కలిగి ఉండాలని కలెక్టర్ రాజర్షిషా సూచించారు. ఆదిలాబాద్‌లోని బీసీ స్టడీ సర్కిల్‌లో బీసీ, ఎస్సీ, సంక్షేమ శాఖల ఆధ్వర్యంలో వసతి గృహ సంక్షేమ అధికారులు, నాలుగవ తరగతి ఉద్యోగులకు శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా కలెక్టర్ హాజరై మాట్లాడారు. వసతిగృహాల విద్యార్థులను ఉత్తమ ఫలితాలు సాధించేలా తీర్చిదిద్దాలని సూచించారు. విద్యార్థుల సందేహాలను ఎప్పటికప్పుడు నివృత్తి చేస్తూ చదువుపై వారికి ఆసక్తి కలిగించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమశాఖ అధికారులు సునీతాకుమారి, రాజలింగు, వసతి గృహాల అధికారులు, నాలుగవ తరగతి ఉద్యోగులు తదితరులు ఉన్నారు.

# పత్తి రైతుపై 'నకిలీ' కత్తి

● ధనార్జనే ధ్యేయంగా దళారుల దందా ● గుర్తింపు పొందిన కంపెనీల ప్యాకెట్లలో విక్రయాలు ● కర్షకుల జీవితాలతో చెలగాటం



నకిలీ విత్తనాల తయారీ కేంద్రంలో విచారణ చేపడుతున్న వ్యవసాయ శాఖ అధికారులు



నకిలీ పత్తి విత్తనాలు



నకిలీ విత్తనాల తయారీకి ఉపయోగించే కెమికల్

ఆదిలాబాద్, మే 24 ( నమస్తే తెలంగాణ) : పత్తి రైతుపైకి 'నకిలీ' కత్తి దూసుకొస్తున్నది. కొందరు దళారులు, వ్యాపారులు ధనార్జనే ధ్యేయంగా నకిలీ పత్తి విత్తనాల దందా చేస్తూ అందినకాడికి దండుకుంటున్నారు. కర్షకుల అమాయ కత్వాన్ని ఆసరాగా చేసుకొని వారి జీవితాలతో చెలగాటమాడుతున్నారు.

### జిల్లాలో 4 ఎకరాల్లో పత్తి సాగు..

జిల్లాలో నల్లరేగడి భూములు, వర్షాలు, సానుకూల వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో ఇక్కడ 90 శాతం మంది రైతులు పత్తి సాగు చేస్తుంటారు. ప్రతి వానకాలంలో జిల్లాలో 1.50 లక్షల మంది రైతులు 4 లక్షల ఎకరాలకు పైగా పత్తిని సాగు చేస్తున్నారు. పంట పెట్టుబడి కోసం బ్యాంకులు, వడ్డీ వ్యాపారుల వద్ద అప్పులు చేయాల్సి వస్తున్నది. పరిస్థితులు అనుకూలించి పంటలు బాగా పండితే చేసిన అప్పులు తీర్చడంతో పాటు ఏడాది పాటు కుటుంబపోషణకు సరిపడా ఖర్చులు మిగులుతాయి. నకిలీ విత్తనాలతో మోసపోయినా, ప్రకృతి వైపరీత్యాల పంట దెబ్బతిన్నా రైతులు భారీగా నష్టపోవాల్సి వస్తున్నది.

### నకిలీ విత్తనాలతో నిండా మునుగుతున్న రైతులు..

ధనార్జనే ధ్యేయంగా అక్రమార్కులు నాసిరకం, నకిలీ విత్తనాలను రైతులకు విక్రయిస్తూ నిండా ముంచుతున్నారు. ప్రభుత్వ గుర్తింపు కంపెనీల పేరిట నకిలీ విత్తనాల దందా జిల్లాలో కొనసాగుతున్నది. వివిధ కంపెనీలకు చెందిన బీటీ–2 విత్తనాలను రైతులు ఉపయోగిస్తారు. 55 కంపెనీల పత్తి విత్తనాలను అందుబాటులో ఉంచినట్లు వ్యవసాయశాఖ అధికారులు అంటున్నారు. తమ భూముల్లో ఏ కంపెనీలకు చెందిన విత్తనాలు వేయాలో రైతులు ముందుగా నిర్ణయించుకుంటారు. కొందరు దళారులు ప్రముఖ కంపెనీ విత్తనాల ముసుగులో నకిలీ పత్తి విత్తనాలను రైతులకు అంటగడుతున్నారు. శుక్రవారం పట్టణంలోని రాంనగర్‌లో పోలీసులు, వ్యవసాయ శాఖ అధికారులు పట్టుకున్న నకిలీ విత్తనాలతో పాటు అసలు విత్తనాలు సైతం ఉన్నాయి. మీనాక్షి, పుడమి కంపెనీలకు చెందిన అసలు విత్తనాల ప్యాకెట్లు లభ్యమయ్యాయి. ఆ కంపెనీలకు చెందిన ఖాళీ విత్తనాల ప్యాకెట్లు సైతం దొరికాయి. నాసిరకం పత్తి విత్తనాలకు కెమికల్, కలర్ కలిపిన రంగును పట్టించి అసలు విత్తనాలతో కలిపి విక్రయిస్తున్నట్లు తెలుస్తున్నది. ఓ విత్తన కంపెనీలో పనిచేసే ఉద్యోగి ఈ నకిలీ దందాకు పాల్పడినట్లు గుర్తించిన పోలీసులు ఆయనను అదుపులోకి తీసుకున్నారు. మీనాక్షి కంపెనీకి చెందిన గుర్తింపు సర్టిఫికెట్లను సైతం అధికారులు పరిశీలించారు. పట్టణం నడిబొడ్డున నకిలీ విత్తనాల దందా కొనసాగడం దళారుల అక్రమ సంపాదనకు నిదర్శనంగా చెప్పవచ్చు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, పోలీసులు స్పందించి ముమ్మరంగా తనిఖీలు నిర్వహించి నకిలీ విత్తనాలు విక్రయించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

## 400 కిలోల నకిలీ పత్తి విత్తనాలు పట్టివేత

● వీటి విలువ రూ.19 లక్షలు ● ముగ్గురిపై కేసు, ఇద్దరి అరెస్ట్

ఎదులాపురం, మే 24 : ఆదిలాబాద్ పట్టణంలోని మావల పోలీస్ స్టేషన్ పరిధిలోని రాంనగర్ ఏరియాలో నకిలీ పత్తి విత్తనాలను శుక్రవారం పోలీసులు పట్టుకున్నారు. జిల్లా ఎస్పీ గౌస్ ఆలంకు అందిన విశ్వసనీయ సమాచారం మేరకు స్పెషల్ బ్రాంచ్ పోలీసులు దాడి చేయగా దాదాపు 400 కిలోల నకిలీ పత్తి విత్తనాలను గుర్తించారు. వాటి విలువ దాదాపు రూ.19 లక్షల ఉంటాయని తెలిపారు. వ్యవసాయాధికారుల ఫిర్యాదు మేరకు నకిలీ విత్తనాల కేంద్రం నిర్వాహకులు సామా అశోక్ రెడ్డి, ఏ.రాజేందర్, కాపర్తి మణికంఠ (పరారీ)పై కేసులు నమోదు చేశారు. ఈ ముగ్గురు పలు వ్యాపారాలు నిర్వహిస్తుంటారని తెలిపారు. వీరు ఆదిలాబాద్ పట్టణంలోని మీనాక్షి గోల్డ్, పాండు రంగ, పుడమి జే16, వైట్ గోల్డ్ అనే కంపెనీల పేరుతో నకిలీ విత్తనాలను తయారు చేసి విక్రయిస్తుంటారని విచారణలో తెలిసింది. తదుపరి విచారణ కొనసాగుతుందని వీరితో సంబంధం ఉన్న వారందరిపై కేసులు నమోదు చేస్తామని తెలిపారు. ఆదిలాబాద్ జిల్లా మావల పోలీస్ స్టేషన్‌లో వీరిపై కేసు నమోదైనట్లు వెల్లడించారు. వీరి వద్ద నుంచి కొన్న విత్తనాలను రైతులు, డీలర్లు వినియోగించవద్దని సూచించారు. ఒకవేళ ఎవరివద్దనైనా ఉంటే సంబంధిత వ్యవసాయ అధికారులకు తెలియజేయాలని సూచించారు.



నకిలీ విత్తనాల ప్యాకెట్లను పరిశీలిస్తున్న ఆదిలాబాద్ ఎస్పీ గౌస్ ఆలం, అధికారులు



నిర్మల్ అర్బన్ : పరీక్షా కేంద్రానికి వస్తున్న విద్యార్థినులు

## ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు ప్రారంభం

ఎదులాపురం, మే 24: ఇంటర్మీడియట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో 6, ఉట్నూర్‌లో 2, ఇచ్చోడలో 2, బజార్‌హత్నూర్, నేరడిగొండ, బోథ్, ఇంద్రవెల్లి మండలకేంద్రాల్లో ఒక్కొక్కటి చొప్పున మొత్తం 14 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. మొదటి సంవత్సరం విద్యార్థుల్లో 1398 మందికి గాను 1311 మంది పరీక్షలు రాశారు. ద్వితీయ సంవత్సరం విద్యార్థుల్లో 529 మందికి గాను 482 మంది హాజరైనట్లు డీఐఈవో రవీందర్ కుమార్ తెలిపారు.

### నిర్మల్ జిల్లాలో..

నిర్మల్ అర్బన్, మే 24 : నిర్మల్ జిల్లాలో 13 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. జనరల్ కోర్సుల్లో 1010మందికి గాను 930 మంది పరీక్ష రాశారు. వొకేషనల్‌కోర్సుల్లో 204 మందికి గాను 186 మంది హాజరయ్యారు. జిల్లా వ్యాప్తంగా 98 మంది గైర్హాజరైనట్లు నిర్మల్ డీఐఈవో పరశురాం తెలిపారు. జిల్లా కేంద్రంలోని వశిష్ట జూనియర్ కళాశాల, చాణక్య, ప్రభుత్వ బాలుర, బాలికల జూనియర్ కళాశాలల్లోని పరీక్షా కేంద్రాలను పరిశీలించారు.



ఎదులాపురం : ఆదిలాబాద్‌లో పరీక్ష రాస్తున్న విద్యార్థులు

## ప్రశాంతంగా పాలిసెట్

ఎదులాపురం, మే24 : పాలిటెక్నిక్ కళాశాలల్లోని వివిధ కోర్సుల్లో ప్రవేశానికి నిర్వహించిన పాలిసెట్ పరీక్ష ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో శుక్రవారం ప్రశాంతంగా జరిగింది. మూడు పరీక్షా కేంద్రాల్లో తగిన ఏర్పాట్లు చేశారు. నిమిషం నిబంధన అమల్లో ఉన్న నేపథ్యంలో విద్యార్థులు ముందుగానే విద్యాచేరుకున్నారు. క్షుణ్ణంగా తనిఖీ చేసి లోనికి అనుమతించారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పరీక్ష సాగింది. మొత్తం 1059 మందిలో 531 మంది బాలురు, 408 మంది బాలికలు హాజరయ్యారు. 120 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు పాలిసెట్ సమన్వయకర్త భరద్వాజ తెలిపారు.

### నిర్మల్ జిల్లాలో..

నిర్మల్ అర్బన్, మే 24 : నిర్మల్ జిల్లా కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన పాలిసెట్ పరీక్షను ప్రశాంతంగా నిర్వహించినట్లు కన్వీనర్, పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ అన్నపూర్ణ తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఐదు పరీక్షా కేంద్రాల్లో 1946 మంది విద్యార్థులకు గాను 1720 మంది హాజరుకాగా 226 మంది గైర్హాజరైనట్లు ఆమె తెలిపారు.

## సీజనల్ పండ్లతో ఆరోగ్యం

ఉట్నూర్, మే 24: సీజనల్ పండ్లను తినడం ద్వారా ఆరోగ్యంగా ఉండవచ్చని ఐటీడీఏ పీవో ఖుష్బుగుప్తా అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని కుమ్రంభీం ప్రాంగణంలో సమ్మర్ క్యాంప్‌లో విద్యార్థులకు సహజసిద్ధంగా పండిన మామిడి పండ్లను అందజేశారు. ఉద్యానవన శాఖ అధికారి సందీప్ కుమార్, జిల్లా క్రీడాధికారి పార్థసారథి, హెచ్ఎన్‌టీసీ అధికారి సుధీర్ కుమార్, అర్షిత, పూజ, సాయిరాజ్, ఏటీడీవోలు పాల్గొన్నారు.

## పాఠశాలల్లో మరమ్మతులు త్వరగా పూర్తి చేయాలి

● యూనిఫాంలను సిద్ధం చేయాలి
● ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా

ఇచ్చోడ, మే 24 : ప్రభుత్వ పాఠశాలల్లో చేపడుతున్న అభివృద్ధి, మరమ్మతులను త్వరగా పూర్తి చేయాలని ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా ఆదేశించారు. ఇచ్చోడలోని జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాల, జడ్పీఎస్ఎస్ ఉర్దూ మీడియం పాఠశాలలో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ ద్వారా చేపడుతున్న పనులను జిల్లా కలెక్టర్ రాజర్షి షా శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్) ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో ఏర్పాటు చేసిన 'జై సంతోషి మాతా' మహిళా శక్తి టైలరింగ్ సెంటర్, స్వయం సహాయక సంఘాల ఆధ్వర్యంలో స్కూల్ యూనిఫాం కుట్టు శిక్షణ కేంద్రాన్ని ప్రారంభించారు. కుట్టిన దుస్తులను పరిశీలించారు. స్వయం సహాయక సంఘాల సభ్యులతో స్కూల్ యూనిఫాం తయారు చేస్తున్న విధానాన్ని జిల్లా పాలనాధికారి అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల కోసం అందిస్తున్న ఏకరూప యూనిఫాంలను నాణ్యతగా కుట్టి, సకాలంలో అందించాలన్నారు. పాఠశాలలు ప్రారంభానికి ముందే సిద్ధం చేయాలని ఆదేశించారు. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ ద్వారా చేపడుతున్న నిర్మాణ పనులను పరిశీలించారు. పనుల పురోగతిని సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఏమైనా సమస్యలుంటే తన దృష్టికి తేవాలని సూచించారు. అమ్మ ఆదర్శ పాఠశాల కింద వచ్చిన నిధులను సక్రమంగా వినియోగించాలని తెలిపారు. ఫ్లోరింగ్, తాగునీరు, మరుగుదొడ్లు, ఫ్యాన్లు, ట్యూబ్ లైట్లు, ప్రహరీని పరిశీలించారు. వాటికి చేపట్టాల్సిన మరమ్మతులను త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రతి స్కూల్‌లో ఎల్ఈడీ బల్బులే వాడాలన్నారు. తరగతులు ప్రారంభానికి ముందే పాఠశాలలను పూర్తి స్థాయిలో రిపేరు చేయించి అందుబాటులోకి తీసుకరావాలన్నారు. కార్యక్రమంలో డీఈవో ప్రణీత, డీఆర్డీవో, ఎంఈవో ఉదయ్‌రావ్, ఎంపీడీవో లక్ష్మణ్, తహసీల్దార్ తుకారాం, హెచ్ఎంలు, అధికారులు పాల్గొన్నారు.



ఎదులాపురం : పనులను పరిశీలిస్తున్న కలెక్టర్ రాజర్షి షా

### ఆదిలాబాద్ పట్టణంలో..

ఎదులాపురం, మే24 : పట్టణంలోని మహాలక్ష్మీవాడలోని ప్రభుత్వ పాఠశాలలో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ ద్వారా చేపడుతున్న పనులను కలెక్టర్ రాజర్షి షా పరిశీలించారు. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ సభ్యులతో మాట్లాడారు. పనులు నాణ్యతతో వేగవంతంగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. డీఈవో ప్రణీత, డీఆర్‌డీఏ ఎంఈవో, ఎమ్మార్వో, తదితరులు ఉన్నారు.



అమ్మవారిని దర్శించుకుంటున్న ఐజీ అరోమా సింగ్

## అమ్మవారిని దర్శించుకున్న ఐఆర్‌పీఎఫ్ఎస్ ఐజీ

బాసర, మే 24 : బాసర సరస్వతీ అమ్మవారిని శుక్రవారం రైల్వే డిపార్ట్‌మెంట్ ఐఆర్‌పీఎఫ్ఎస్ ఐజీ అరోమా సింగ్ దర్శించుకున్నారు. ఆలయానికి చేరుకున్న వారికి అధికారులు ఘనంగా ఆహ్వానించారు. అనంతరం అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు.

### సిద్దిపేట జిల్లా సెషన్ జడ్జి పూజలు..

బాసర సరస్వతీ అమ్మవారిని సిద్దిపేట జిల్లా సెషన్ జడ్జి రమాదేవి కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయానికి చేరుకున్న వారికి అధికారులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు.



పూజలు చేస్తున్న సిద్దిపేట జిల్లా సెషన్ జడ్జి రమాదేవి



కడెం ప్రాజెక్టు పనులు పరిశీలిస్తున్న కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్



ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్

## కడెం ప్రాజెక్టు పనులు వేగవంతం చేయాలి

● వానకాలం ప్రారంభంలోగా గేట్లకు మరమ్మతులు పూర్తి చేయాలి ● నిర్మల్ కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్

కడెం, మే 24: కడెం ప్రాజెక్టు గేట్ల మరమ్మతు పనులను జూన్ మొదటివారంలోగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని నిర్మల్ కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆయన కడెం ప్రాజెక్టును సందర్శించి ప్రాజెక్టు పనుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కడెం ప్రాజెక్టు గేట్లు, ఇతర మరమ్మతు పనులను జూన్ మొదటి వా రంలోగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గత ఏడాది భారీ వరదల వల్ల ప్రాజెక్టు గేట్లు తెరుచుకోని కారణంగా ఇబ్బందికరమైన పరిస్థితులు ఏర్పడిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. గత అనుభవాల ను దృష్టిలో ఉంచుకొని అలాంటి సమస్యలు పునరావృ తం కాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. వర్షాలు కురిసే నాటికి ఎట్టి పరిస్థితుల్లోనూ పనులు పూర్తి కావాలని ఆదేశించారు. పనుల నిర్వహణపై ఇంజినీరింగ్ అధికారులకు పలు కీలక సూచనలు చేశారు. అనంతరం కడెం మండల కేంద్రంలోని జడ్పీ పాఠశాలలో విద్యార్థుల కోసం డీఆర్డీవో ఆధ్వర్యంలో మహిళా స్వయం సహాయక బృందాలతో ఏకరూప దుస్తులు కుట్టే పనులను ఆయన పరిశీలించారు. విద్యా సంవత్సరం ప్రారంభానికి ముందే ఏకరూప దుస్తులను సిద్ధం చేయాలన్నారు. నాణ్యతతో వేగవంతంగా కుట్టాలని సూచించారు. అనంతరం లింగాపూర్‌లో వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని తనిఖీ చేశారు. వర్షాకాలం సమీపిస్తున్న దృష్ట్యా ధాన్యాన్ని త్వరగా కొనుగోలు చేయాలని, ట్యాబ్ ఎంట్రీలను పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంటవెంటనే మిల్లులకు తరలించాలని నిర్వాహకులను ఆదేశించారు. కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు ఇబ్బందులు కలిగించవద్దన్నారు. అనంతరం సారంగపూర్‌లోని ప్రాథమిక పాఠశాలలో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ ద్వారా చేపట్టిన పనులను ఆయన పరిశీలించారు. పనులకు నాణ్యమైన వస్తువులను ఉపయోగించాలన్నారు. మరుగుదొడ్ల నిర్మాణ పనులు, స్లాబ్ మరమ్మతులు, గ్రిల్స్ ఏర్పాటు, పెయింటింగ్స్, ఇతర పనులను పరిశీలించి పలు సూచనలు చేశారు. ఆయన వెంట డీఈవో రవీందర్‌రెడ్డి, డీఆర్డీవో విజయలక్ష్మి, పంచాయతీ రాజ్ శాఖ ఈఈ శంకరయ్య, సివిల్ సప్లై డీఎం శ్రీకళ, తహసీల్దార్ సుజాత, వివిధ గ్రామాలకు చెందిన నాయకులు, రైతులు, అధికారులు ఉన్నారు.

## కలుషిత నీరు తాగి 20 మందికి అస్వస్థత

నార్నూర్, మే 24 : కలుషిత నీరు తాగి 20 మంది అస్వస్థతకు గురైన సంఘటనశుక్రవారం ఆదిలాబాద్ జిల్లా గాదిగూడ మండలం లోకారి(బీ) గ్రామంలో జరిగింది. గ్రామ పంచాయతీకి చెందిన బావి నుంచి సరఫరా అయిన నీటిని తాగడంతో వాంతులు, విరేచనలు అయినట్లు గ్రామస్తులు తెలిపారు. సమాచారం అందుకున్న అంబులెన్స్ సిబ్బంది అక్కడికి చేరుకొని ప్రథమ చికిత్స అందించారు. మెరుగైన వైద్యం కోసం ఆదిలాబాద్‌లోని రిమ్స్ దవాఖానకు తరలించారు. ఈ విషయంపై పంచాయతీ కార్యదర్శి దుర్గం రాహుల్‌ను వివరణ కోరగా ఇటీవలే బావిని శుభ్రం చేసి క్లోరినేషన్ చేశామని తెలిపారు.



అస్వస్థతకు గురైన వారిని అంబులెన్స్‌లో తరలిస్తున్న సిబ్బంది